ఓ యాభై ఏళ్ల గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం ఆరోగ్యం పట్ల అవగాహన పెరిగింది. రోగాన్ని గుర్తించడం, చికిత్స, మందులు అన్నిటిలోనూ సౌలభ్యం పెరిగింది. రవాణాలో మార్పు వల్ల 'పెద్దాసుపత్రులు' మరింత చేరువయ్యాయి. కానీ మన కుటుంబాన్ని గమనించుకోవాల్సిన ఫ్యామిలీ డాక్టర్ అవసరం మాత్రం అలాగే ఉంది. ఇంకా మాట్లాడితే తన బాధ్యత మరింత పెరిగింది. కానీ అటువైపు వెళ్తున్న వైద్యులు, వారి దగ్గర చికిత్సను కోరుకునే రోగుల సంఖ్య మాత్రం గణనీయంగా తగ్గిపోతున్నది. నిశ్శబ్దంగా వచ్చిన ఈ మార్పు వెనుక కారణాలు మాత్రం చాలా స్పష్టంగా ఉన్నాయి. దానికంటే ముందు కాస్త మంచిని తల్చుకుందాం...



- ఫ్యామిలీ డాక్టర్ అంటే ఇంట్లో మనిషే. మన ఇంట్లో పసిపిల్లల దగ్గర్నుంచీ వృద్ధుల వరకూ ఎవరి సమస్యలు ఏమిటి, వాటికి ఎలాంటి చికిత్సలు జరుగుతున్నాయి, ఏ పనులు చేస్తారు, వారి జీవనశైలి ఎలా ఉంటుంది లాంటి కూలంకషమైన విషయాలన్నీ ఆయనకు కొట్టిన పిండి. దాంతో మన శరీర తత్వాన్ని బట్టి చికిత్స, అవసరాన్ని బట్టి మందులూ ఇస్తారు.
- ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం మన దేశంలో దాదాపు 7.7 కోట్ల మంది మధుమేహంతో బాధపడుతున్నారు. మరో 2.5 కోట్ల మంది మధుమేహానికి చేరువగా ఉన్నారు. అందుకే మన దేశాన్ని మధుమేహ రాజధానిగా పిలుస్తున్నారు. కదలని మెదలని జీవనశైలి వల్లనో, వంశ పారంపర్యంగానో ఈ మధుమేహంతో పాటుగా రక్తపోటు, ఊబకాయం లాంటి సమస్యలు వస్తున్నాయి. తరచూ ఫ్యామిలీ డాక్టర్ దగ్గరికి వెళ్లి చెకప్ చేయించుకోవడం, వాళ్ల మందులు క్రమం తప్పకుండా తీసుకోవడమే వీటికి పరిష్కారం.
- నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్. అంటే ఇవి ఒకరి నుంచి ఒకరికి సోకవు. ఆస్తమా నుంచి కిడ్నీ సమస్యల వరకూ చాలా సమస్యలు ఈ కోవలోకే వస్తాయి. కానీ మన ఆయుష్షుకి ఇవే కీలకం. ఓ అంచనా ప్రకారం మన దేశంలో 60 శాతం మరణాలకు ఇవే కారణం. ఆర్థికంగానూ, ఆరోగ్యపరంగానూ భారమయ్యే ఈ పరిస్థితుల్లో ఫ్యామిలీ డాక్టర్‌ది కీలకపాత్ర. సమస్య ముదరకుండా చికిత్స చేయడం దగ్గర్నుంచీ, పెద్దాసుపత్రిలో చికిత్స తీసుకుంటే... తిరిగివచ్చాక గమనించుకోవడం వరకూ తను బాధ్యత తీసుకుంటారు.
- ఓ అంచనా ప్రకారం మన దేశంలో 38 శాతం పిల్లలు, ఉండాల్సిన ఎత్తు కన్నా తక్కువ ఎత్తులో ఉన్నారు. 'స్టంటెడ్' అనే ఈ సమస్యకు కారణం పోషకాహార లోపమే. సాధారణ దృష్టికి తోచని ఇలాంటి ఎన్నో సమస్యలను డాక్టర్లు చూడగానే పసిగట్టేస్తారు. మన కళ్లజోడు ఫ్రేం నుంచి వేసుకున్న చెప్పుల వరకూ తెలిసీతెలియక చేసే లోపాలను గుర్తుపట్టేస్తారు. వీటన్నిటి గురించి సలహా ఇచ్చే చొరవ, అవకాశం ఫ్యామిలీ డాక్టర్లకే ఎక్కువ.
- మన దేశంలో వైద్యానికి అయ్యే ఖర్చులో 60 శాతం రోగుల కుటుంబాలే భరిస్తున్నాయి. సంస్థలు లేదా బీమా వ్యవస్థ నుంచి అందేది 40 శాతం మాత్రమే అని అంచనా. ఈ నేపథ్యంలో కేవలం అవసరమయ్యే చికిత్సనే అందించే ఫ్యామిలీ డాక్టర్లు మేలు చేస్తున్నట్టే.
- రోగం అనగానే మెడికల్ టెస్టులే గుర్తుకు వస్తున్న కాలమిది. రోగ నిర్ధారణ కోసం పరీక్షలు రాసినప్పుడు 88 శాతం రోగులకు అందులో ఒక్క పరీక్షన్నా అనవసరంగా రాస్తున్నారని ఓ నివేదిక చెబుతున్నది. అంతేకాదు తల మీద చిన్నపాటి దెబ్బలకు కూడా సీటీ స్కాన్ రాస్తున్నారనీ, లిపిడ్ ప్రొఫైల్ టెస్ట్ మమోగ్రాం లాంటివి తరచుగా అవసరం లేదనీ లలిత్ కపూర్ అనే సామాజిక ఉద్యమకారుడు హెచ్చరిస్తున్నారు. లేనిపోని ఇలాంటి పరీక్షల వల్ల ఆర్థికపరమైన సమస్యలతో పాటు రోగులు ఉద్వేగానికి కూడా లోనవుతున్నారని డాక్టర్ సంజయ్ పాటిల్ వాపోతున్నారు. ఫ్యామిలీ డాక్టర్ పర్యవేక్షణలో ఏ పరీక్ష అవసరం, అసలు దాని లక్ష్యం ఏంటి లాంటి అనుమానాలన్నీ తీరిపోతాయి.

## ఎవరీ ఫ్యామిలీ డాక్టర్స్?

ఎంబీబీఎస్ పూర్తి చేసిన తర్వాత ఫ్యామిలీ మెడిసిన్ రంగంలో మరో స్పెషలైజేషన్ చేస్తే 'ఫ్యామిలీ ఫిజీషియన్'గా గుర్తింపు దొరుకుతుంది. రోగ నిర్ధారణ మొదలుకుని రోగులతో అనుబంధం పెంచుకోవడం వరకూ ఈ కోర్సులో ఓ కుటుంబ వైద్యుడికి ఉండాల్సిన అన్ని నైపుణ్యాలనూ నేర్పిస్తారు. అలాగని వీరు మాత్రమే ఫ్యామిలీ డాక్టర్లుగా చెలామణీ అవ్వాలనే నిబంధన ఏమీ లేదు. ఎంబీబీఎస్‌తో ఆగిపోయినవారు, ఎంబీబీఎస్ తర్వాత సర్టిఫికెట్ కోర్సులు చేసినవారు, ఆర్ఎంపీ లాంటి కొన్ని గుర్తింపులు తెచ్చుకున్నవారూ... అంతదాకా ఎందుకు! ఏదన్నా రంగంలో స్పెషలైజేషన్ చేసినా కూడా అన్నిరకాల వ్యాధులనూ పరిశీలించేందుకు సిద్ధంగా ఉన్నవారు ఫ్యామిలీ డాక్టర్లే!



### ఫ్యామిలీ డాక్టర్ల కష్టాలు!

ఒకప్పుడంటే పది రూపాయల ఫీజు తీసుకున్నా ఆదాయం కింద చెల్లిపోయేది. కానీ రోజులు మారాయి. వైద్య విద్య పూర్తిచేయడానికి అయ్యే విపరీత ఖర్చులతో పాటు ప్రపంచీకరణ పుణ్యమా అని జీవనశైలి ఖర్చులూ పెరిగిపోయాయి. క్లినిక్‌ల నిర్వహణ వ్యయాలూ పెరిగాయి. ఓ మల్టి స్పెషాలిటీ ఆసుపత్రిలో విజిటింగ్ డాక్టర్‌గా పనిచేసినా, కడుపులో చల్ల కదలకుండా వచ్చే ఆదాయం... ప్రత్యేకమైన క్లినిక్‌ల ద్వారా రావడం లేదన్నది చాలామంది ఆవేదన. కేవలం ఆర్థికపరమైన సమస్యలే కాదు! ఇతరత్రా చాలా సమస్యలూ వారిని వేధిస్తున్నాయి.

- జ్వరం వస్తే డోలో, జలుబు చేస్తే రిలెంట్, కడుపునొప్పికి మెట్రోజిల్... ఇలా మందుల పేర్లు కాకుండా వాటి కంపెనీల పేర్లు ఎప్పుడైతే జనాలకు అలవాటయ్యాయో, ఏ సమస్య వచ్చినా వారే కొనుక్కుని వేసుకోవడం పెరిగిపోయింది. వైద్యుడి చీటీ లేకుండా 'ఓవర్ ద కౌంటర్' మందులను అందించేందుకు విదేశాల్లో చాలా నిబంధనలు ఉన్నాయి. మన దగ్గర మాత్రం నిద్రమాత్రలు సైతం ఎక్కడో అక్కడ దొరికేస్తున్నాయి. భారతీయులు డోలో 650ని చాక్లెట్లు నమిలినట్టు నమిలేస్తున్నారంటూ ఇటీవల పళనియప్పన్ అనే వైద్యుడు చేసిన ట్వీట్ ఈ పరిస్థితికి అద్దం పడు